'ఆటా' కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

- చొప్పదండి సుధాకర్



# బతుకు ఎన్నెల్లో...!

పంటి కొసన ఆయాసాన్ని బిగబట్టి తొర్రిప్పగడ్డ ఎక్కి తీరాలనే ఆరాటంతో కనకయ్య మొండి పట్టుదలగా సైకిల్ ఎగిరెగిరి తొక్కుతున్నాడు. ఎప్పుడో స్కైలాబ్ పడుతుందన్న పుకారు లేచినప్పుడు మొదల్పెట్టి నడ్మనే వొదిలేశిన కంకరరోడ్డు, తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో కయ్యలుపడి, కంకర తేలి సచ్చిపోయిన బర్రెను గద్దలు పీక్కుతినగా మిగిలిన బొక్కల కుప్ప లెక్క కనీసం నడవడానికి కూడా వీలుగాని విధంగా మారిపోయింది. అటువంటి రోడ్ మీద డొక్కు సైకిల్‌తో అదీ ఎత్తుగడ్డకి తొక్కడమంటే నరకానికి నకలు ప్రయాణమన్నట్టే! కనకయ్యకు మాత్రం అటువంటి నరకాలూ, అనుభవాలు మామూలే!

సైకిల్‌కి రెండువైపులా వొద్దంటే పుట్టుకొచ్చిన దరిద్రపు దాని కడుపులాగా ప్లాస్టిక్ తాడు వలలో బిగించి కట్టిన శీమెండిబోల్లు ప్రతి చిన్న కుదుపుకీ దడదడమని చప్పుడుచేస్తూ కనకయ్య రాకని అంత దూరం నుండే చాటింపు వేస్తున్నాయి.

పట్నంలో సేఠ్ దగ్గర రొండువేలు డిపాజిట్ కట్టి పదిహేను వందల శీమెండిబోల్లు బాసండ్లు తీసుకొని ఇట్లా సైకిల్ మీద ఊరూరా తిరిగి అమ్ముకోవడం అతడి బతుకుతెరువుగా చేసుకొని నాలుగేళ్ళుగా బతుకు బండి లాగిస్తున్నాడు.

సగం ఎత్తు ఎక్కించి ఇక తన వల్లకాదని సైకిల్ దిగాడు కనకయ్య. కడుపులోంచి ఆయాసం కమ్మరికొలిమిలోంచి వచ్చే వేడి సెగలాగా ఎగదన్నుకొస్తుంది. ఆ ఆయాసం చూస్తోంటే తొర్రిప్పగడ్డ కనీసం నడిచి కూడా ఎక్కలేననిపిస్తోంది అతడికి. అయినా 'నీయవ్వ! నడ్మి కూడా సైకిల్ తొయ్యలేకపోతే ఇక నా బతుకు బతుకేకాదనే! తిక్కతో అతి కష్టమీద ఆ గడ్డ ఎక్కి "ఉస్సూ-" అంటూ కూలబడిపోయేడు.

నిజం చెప్పుకోవాలంటే అక్కడికీ ఇంకా మరో పదడుగుల గడ్డ మిగిలే ఉంది. అయినా 'ఇంత దూరం వచ్చాకా, అదీ ఓ గడ్డేనా! తుమ్మితే దాటెయ్యవచ్చు'అనే ఉదాసీనత చాటున ఓటమిని దాచుకొంటూ తోవ పక్కనున్న వాయిలిపొద పక్క బండ మీద కూచున్నాడు కనకయ్య.

గుట్ట ఎత్తుగా ఉండడంవల్ల దాదాపు అయిదారు కిలోమీటర్ల పరిధి స్పష్టంగా కనిపిస్తోంది. 'ఇదంతా ఒకప్పుడు కాకులు దూరని కారడవిగా, చీమలు దూరని చిట్టడవిగా ఉండేదని' అవుసుల బ్రహ్మయ్య తాత చెబుతోంటే చిన్నప్పుడు నోరు తెరచుకొని వినేవాడు కనకయ్య.

'ఇక్కడో పెద్ద ఇప్ప చెట్టుండేది. దానికో పెద్ద తొర్ర. అందుకే ఈ చోటుకి తొర్రిప్ప అనే పేరు పడిపోయింది. ఆ తొర్ర ఎంత పెద్దదంటే అందులో ఒకేసారి పదిపన్నెండు మంది దొంగలు దాక్కొని పగటిపూటే ఇటుగా వచ్చీపోయేవారిని దోచుకొనే వార్రా కనకయ్యా!' ఆయన చెబుతోంటే కనకయ్యకు వెన్నులోంచి పాములు జరజరా పాకినట్టయి తాతకు దగ్గరగా జరిగేవాడు.

ఆలోచనల్లోపడి కొట్టుకుపోతూనే అతడి చేయి అప్రయత్నంగా జేబులో బీడికోసం వెతకసాగింది. చేతికి దొరికిన బీడిని కొనకొరికి నోట్లో పెట్టుకొని అగ్గిపెట్టెకోసం వెతుకులాడేడు. అయితే చేతికి రెండు మూడు అగ్గిపుల్లలే తప్ప అగ్గిపెట్టె దొరకలేదు. ప్రాణం ఉసూరుమంది! జేబులో అగ్గిపెట్టె లేకుండా ఉత్తి పుల్లలు మాత్రమే ఉండడం వెనక పెద్ద కథే ఉంది! ఆ కథలో వీరోయిన్ శామంతి!

కనకయ్యకు శామంతి అంటే సచ్చేంత భయం. ఆమె భయానికే జేబులో అగ్గిపుల్లలు తప్ప పెట్టె ఉంచుకోడు. 'పుల్లలు మాత్రం ఎందుకనీ?' శామంతి నిలదీస్తే చెవిలోంచి గుమిలి తీసుకోవడానికని అబద్ధమాడతాడు. అట్లా జెప్పి ఆ వంకతో నాలుగు పుల్లలు జేబులో వేసుకొని తోవలో ఎక్కడ కిరాణకొట్టు కనిపించినా అక్కడే ఓ బీడీ కొనుక్కొని ఆ తర్వాత ఏ చెట్టు చాటుకో, పుట్ట చాటుకో వెళ్ళి జేబులో పుల్లలకి తోడుగా ఖాళీ అగ్గిపెట్టె సంపాదించి దాంతో బీడీ అంటించి గుండెల నిండా పొగ పీల్చి ఆనందపడిపోతాడు. అక్కడికీ శామంతి గుండెలుతీసిన బంటు! ఓసారి చేతి వేళ్ళు పట్టుకొని వాసన చూసి గుర్రుమంటూ చూపుల్తోనే కరిచేసినంత పని చేసింది.

'దిక్మెల్ల బీడీలు అల్వాటు జేసుకొన్నవుగదా!' మూతి మూడొంకర్లు తిప్పింది. అదట్లా తిప్పితే కనకయ్య ప్రాణం ఆనందంతో పొయిలో పడ్డ ప్లాస్టిక్ కాగితంలాగా మెలికలు తిరిగిపోతుంటుంది. ఎందుకంటే శామంతి కోపంలో కోటి చంద్రులు ఒక్కసారిగా నవ్వినట్టుంటుంది.

ఇంతాజేస్తే శామంతి అతడి పెళ్ళాంకాదు! కానీ మనసులో అంతకన్నా ఎక్కువే! అన్ని అనుకొన్నట్టుగా జరిగితే ఈ ఏడాదే దాన్ని పెళ్ళి చేసుకోవాలన్నది అతడి గుండెలో గూడుకట్టుకొన్న మాట. అయితే ఆ 'ఏడు' గత ఏడేళ్ళుగా కనకయ్య చేతికందడం లేదు. ముప్పయ్యేళ్ళు దాటుతోన్నా కనకయ్యకు శామంతి కాదుగదా! కనీసం ఏ గడ్డిపూవుని కూడా పెళ్ళాడే 'దశ' ఉన్నట్టు కనిపించడం లేదతడికి.

"మాలాంటోళ్ళు తాగితెనే కదా! మీలాంటోళ్ళు బీడీలు చేసుకు బతికేది. ఎవరూ తాగకపోతే మీకు ఎట్లా నడుస్తదే మరి?" పరాచికమాడతాడు. "సాల్లే, సావుతెలివితేటలు!" చురచురలాడ్తూ కోపంగా చూసింది. "నేం జేప్పేదాంట్లో ఏమన్న అబద్ధముందా?" ఎవరూ చూడకుండా సన్నగా కన్నుగీటాడు.

చేతికి దొరికిన బీడిని కొనకొరికి నోట్లో పెట్టుకొని అగ్గిపెట్టె కోసం వెతుకులాడేడు. అయితే చేతికి రెండుమూడు అగ్గిపుల్లలే తప్ప అగ్గిపెట్టె దొరకలేదు. ప్రాణం ఉసూరు మంది! జేబులో అగ్గిపెట్టె లేకుండా ఉత్తి పుల్లలు మాత్రమే ఉండడం వెనక పెద్ద కథే ఉంది! ఆ కథలో వీరోయిన్ శామంతి!

శామంతి ముఖం బీడిల చేటలా విశాలంగా విచ్చుకొంది.

"నన్నేనా? కన్నుగీటి మాట్లాడించింది?"అన్నట్టు నమ్మలేక అనుమానంతో మళ్ళీ చూస్తుంది. మళ్ళీ కన్నుగీటాడు కనకయ్య. రెండోసారి స్పృహలోకొచ్చి, తాను మొదటిసారి చూసింది నిజమేనని తెల్సి ఆమె మొఖం లేత తునికాకులా ముడుచుకుపోగా మోయలేని సిగ్గు బరువుతో తల దించుకొంటుంది.

వాళ్ళ మధ్య సరసం అంతే! పరిచయమైన పదేళ్ళలో ఒక్కసారికూడా ఆమెను ముట్టుకోలేదు కనకయ్య. ఎందుకంటే అతడికి అంతకుమించిన ధైర్యం లేదు. అదేదో మాటవరసకి ఉందనుకొన్నా చొరవ అసలే లేదు మరి! ఈ రెండూ ఉన్నాయనుకొన్నా అన్నింటికన్నా మించి ఆమెను ఖచ్చితంగా పెళ్ళిచేసుకొంటానన్న నమ్మకంలేదు. అక్కడికీ శామంతే నయం! ఒకసారి ఎవరూ లేకుండా చూసి కనకయ్య చేతిమీద గట్టిగా గిచ్చింది. అదీ--- ఒకే--- ఒక్కసారే!!

ఆరోజు రాత్రి కనకయ్య నిద్రపోతే ఒట్టు. నెమలీకలు పారబోసుకొన్నట్టు తెల్లవార్లూ ఎన్నో కలలు అతడిని తడిసి ముద్దచేశాయి.


'దొంగముండ! తనంటే పడి సస్తది" బీడికి అగ్గిదొరకక పోవడంతో ఈ లోకంలోకి వచ్చి చుట్టూ చూశాడు కనకయ్య. ఎక్కడా ఖాళీ అగ్గిపెట్టెగానీ దాని బాపతు మందు ఉన్న కాగితంగానీ కనిపించలేదు. కాకపోతే అక్కడక్కడా తిని పడేసిన గుట్కాపొట్లాలు, ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ సంచులు కనిపించాయి. ఇక లాభం లేదనుకొని లేచి అటూ ఇటూ నాలుగడుగులేసి చూశాడు. అయిదారు నిమిషాలకు అతడి 'వెతుకులాట' ఫలించింది. ఇసుకలో సగం కూరుకుపోయిన చిన్న అగ్గిపెట్టె తాలూకు కాగితం ముక్క దొరికింది. అతడికి గట్టి నమ్మకం! 'ఎంతటి అడవయినా ఇప్పుడు చెట్లకు ఆకులుండకపోవచ్చును గానీ, తిని పారేసిన గుట్కా పొట్లాలు, పాలిథిన్ సంచులు అగ్గిపెట్టెల అవశేషాలు తప్పక దొరుకుతాయి. 'అభివృద్ధి దేశంలో అంతగా చొచ్చుకుపోయింది మరి!' అల్లీపురం బడి పెద్దసారు శేషయ్య మాటలు గుర్తుకొచ్చాయి.

'ఎన్నట తొర్రిప్ప చుట్టూ ఎక్కడబడితే అక్కడ నీళ్ళతో గలగలమని చెల్మెలు, ఉరుకులు పరుగులు పెట్టేవట. ఇప్పుడేమో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ కవర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి' కనకయ్య దిగాలుపడ్డాడు. ఆలోచనల్లోనే అయిదారు నిమిషాలు గడిచిపోయాయి. ఒంట్లో కాస్త సత్తువ వచ్చినట్టనిపించింది. ప్రక్కగా ఉన్న బండ మీద ఒరిగి బీడీ అంటించాడు. మొదటి రెండు దమ్ములకు నోట్లోంచి దగ్గు, కళ్ళలోంచి నీళ్ళు ఒకేసారి దూకాయి. కొంచెంసేపు ఆగి మరో నాలుగయిదు దమ్ములు పీల్చేసరికి వాటంతటవే సర్దుకొన్నాయి.

'ఆ దెయ్యం భయానికి గీనడ్మ బీడి తాగుడే బందయింది. మరీ పదిగేను రోజుల్నుండి అస్సలు తాగే సందే దొరకలేదు. శానా రోజులకి తాగితే గింతే దగ్గూ, బొండిగల నొప్పి' తుప్పున ఉమ్మి దానిమీద కాలుతో మట్టి కప్పుతూ అనుకొన్నాడు.

'పెండ్లి చేసుకొన్నాకా దీన్ని ఎట్లయిన ఇడ్శిపెట్టాలే! లేకపోతే శామంతి నన్నిడ్శిపెట్టిపోతది" ముద్దుగా శామంతిని యాది చేసుకుంటూ లేచి భుజంమీది తువ్వాలుతో మొహం మీది చెమట తుడుచుకొని మళ్ళీ సైకిల్ అందుకొన్నాడు.

సైకిల్ బ్యాలెన్స్ చేయబోతుంటే నడుం కలుక్కుమంది! "ఛీ! రోజురోజుకీ తనకూ వయసు మీదపడి వెయిల బలం తగ్గిపోతోంది. ఎంతయినా ఇగ శానా రోజులు ఈ దందా చేసేందుకు శాతనయెటట్టు లేదు. ఆ--- గా ఉమ్మెర దగ్గరి గుడ్డమ్ముమ్మడయితే గీ కష్టాలేమీ ఉండవు. ఎంత తక్కువల తక్కువ పోయినా రొండు లక్షల దాకా వస్తయి. గా పైసలతోని నేనే సేర్‌నయి దందా బడాయించి దుకాం డ్ల గూసుని నా అటోంటి బ్యారగాల్లని పెట్టుకొంట! అటెన్క శామంతిని లగ్గంజేసుకొని సచ్చేదాకా హాయిగ కాలుమీద కాలేసుకొని బతుకత! కానీ గీ కరువు కాలంల గాగుడ్డం కొనేదెవలు?" కనకయ్య ఆత్మదిగులుగా మూలిగింది.




ఆలోచిస్తూనే మొండిగా సైకిల్ మరో పది గజాలు తోసి, ఇక అక్కడినుండి వంపు ఉండడంతో సైకిల్ ఎక్కాడు. రెండుమూడు పైడిలు వెయ్యగానే సైకిల్ జోరందుకుంది. చల్లటిగాలి మొహానికి ఎదురుగా తాకి ప్రాణం హాయిగా అనిపించింది.

'ఈ సంద్రలు దాటితే వొర్రె అది దాటితే సల్లకవ్వాలు. వాటి నంటుకొనే రంగయ్యపల్లె! మనసులో దగ్గరయిన ఊరుని తలచుకొని ఉల్లాసపడ్డాడు. సైకిల్ దడదడలాడుతుంది' వంపులో పట్టులేకుండా రువ్వడిగా పోతోంది. కొంచెం దూరంగా కంచెపై కట్లెపూవు పొద కనకయ్యలో ఎక్కడలేని హుషారు తెచ్చింది. 'కట్లెపూవు రైకలో నా శామంతీ! నువ్వు కత్తిలెక్క ఉన్నావే శామంతి!' జానపద బాణీకి సొంత కవిత్వం జతచేసి సంతోషంగా పాడుకోసాగాడు. 'శామంతి కట్లెపూవు రంగు జాకెట్ ఈ నడ్మ కన్పిస్తలేదు! ఒక యాళ్ళ శిన్గిపోయిందేమో? ఒకసారి---- ఆ జాకెట్ ఏసుకొని ఉండగా కుట్లూడిపోయి అందులోంచి శరీరం పొంగుకొచ్చి కళ్ళుచెదిరే రంగులో అవి కన్పించి పోతోంటే కళ్ళు ఇప్పపూవుల్లా తెర్చుకొని చూస్తూండిపోయేడు తాను! మాటల్లో ఆ పిచ్చిదీ చూసుకోలేదు. ఆ తర్వాతా శానాసేపటికి ఎందుకో అది చెప్పే సంగతులేవీ తానినడంలేదని అనుమానం వొచ్చి, తన చూపులు ఎక్కడ అంటుకుపోయాయో గమనించి 'నీ తల పండు పల్ల! ఏం జూస్తున్నవ్? శీపురు పుల్లలే శీరుల్ నడ్మికి' అంటూ గయ్‌మంటూ తిట్టుకొంటూ అక్కడి నుండి లేచిపోయింది. దెబ్బకు దయ్యం వొదిలినట్టయింది కనకయ్యకు. పెయ్యంత సల్లగ అయిపోయి చేసిన తెలిసొచ్చి సిగ్గుతో ప్రాణం పోయినట్టయింది. ఇగ శామంతి జన్మలో తనతో మాట్లాడడం కాదుగదా! కనీసం కన్నెత్తిగూడా చూడదనిపించింది. కానీ అర్ధగంట కూడా తిరగకుండానే అదంతా మరచిపోయి అప్పుడే పోయి మీదినుండి దింపిన సర్వపిండి తెచ్చిచ్చి 'మింగూ'అంటూ ఎదురుగా ఎర్రమట్టి దిబ్బమీద కూచుంది. అప్పటికి గానీ కనకయ్య ప్రాణం కుదుటబడలేదు. చిత్రమేమిటంటే ఇంకా శామంతి అదే జాకెట్ వేసుకొని ఉంది. "పెళ్ళయ్యాకా శామంతికిమల్లా ఒక కట్లెపూవు రంగు జాకెట్ పట్టియ్యాలె" మనసులో గట్టిగా అనుకొని సైకిల్ ఊళ్ళోకి తోస్పేడు. ఊరు అంతదూరంలో ఉండగానే "శీమెండి బోళ్ళు బాసాండ్లు అమ్ముతం" అంటూ లయబద్ధంగా అరవసాగాడు. పరిచయమైన గొంతు విని రంగాయపల్లె పరవశించిపోయింది.

* * *

ఊరంతా తిరిగి తిరిగి మధ్యాహ్నం మూడయ్యేసరికి నూటాయాభయి రూపాయల సామాను అమ్మగలిగాడు. అదీ గీచి గీచి బేరమాడి కొన్నవాళ్ళే తప్ప ఉదారంగా కొన్నవాళ్ళెవరూ లేరు. వచ్చిన మొత్తంలో లాభం లెక్కగడితే అంతా కలిపి ఇర్వై రూపాయలు మించలేదు. ఇరవయ్యే కదా! అని బింకానికి పోతే అవీ దక్కవు. అందుకే వొట్టి చేతుల్తో తిరిగి అల్లీపురం వెళ్ళలేక ఎట్లాగో వాళ్ళకీ, వీళ్ళకీ నాలుగు గిన్నెలు అంటగట్టి బ్యారం అయిందనిపించాడు. ఆ తర్వాత కాళ్ళీడ్చుకొంటూ సైకిల్‌తో సహ ఊరి నడ్మనున్న హనుమాండ్ల గుడి దగ్గరకొచ్చాడు. అక్కడి రామయ్య హోటలు చూడగానే చాయ్‌కోసం నాలుక పీకింది. రామయ్య హోటల్ చాయ్ రుచే వేరు! అల్లం దంచి, యాలక్కాయలు వేసి అటు మరిగించి, ఇటు మరిగించి అమృతం లెక్క తయారుచేస్తాడు.

"ఏంరా కనకయ్యా! బ్యారం ఎట్లుంది?" రామయ్య మాట్లాడించాడు.

"ఆ... ఏం బ్యారంలే శిన్నాయినా! పొద్దంత తిరిగితే. ఇర్వయి రూపాయలు దొర్కలే" ఉసూరన్నాడు.

"ఏ బ్యారమయినా గట్లనే ఉందిలే బిడ్డా! అయినా కరువుకాలంల ఎవల్లయినా ఏం గొంటర్లే! ఔగనీ గిదేందిరా, నీ నెత్తంత నడ్మిపోయి తెల్లెంటు కలొచ్చినయి, నా ముంగటి పోరనివి" కనకయ్యని చూసి ఆప్యాయంగా అడిగాడు. "ఆ...పోరడు, ముడ్డికింద ముప్పయిలేవూ" ఎంకమ్మ మాటల్లో నడుమ జొరబడింది.

"ఉంటే మాత్రం నెత్తంతా నడ్వాల్నా! నానెత్తి చూడు, ఒక్క ఎంటిక తెల్లబడితే మీసం గొరిగించుకుంట. మరి నా ఉమ్మర్ అర్వై దాటింది" గీరగా అన్నాడు రామయ్య. "నువ్వంటే ఊరు దాటకుంట సల్లంగ బత్కవడ్తివి! వాడేమో బోళ్ళ బ్యారంమీద ఇన్నూరు ఊళ్ళు తిర్గుడాయె! ఆ ఊర్ల నీళ్ళు దాగుడాయె! నెత్తి నడ్మిందంటే నడ్వదా" కనకయ్యను ఎనకేసుకొచ్చింది ఎంకమ్మ.

"ఏం తిర్గుడోనే నాయినమ్మ! ఈ బతుకు బతుకుడు కన్న సచ్చింది నయమనిపిస్తుంది. ఎవుసం జేద్దామంటే సుక్కనీళ్ళు లేవు. పోనీతీ ఎదయినా దందా జేద్దామంటే గిట్ల! దినడినం బతుకుడే గోసగావట్టె" నెత్తి పట్టుకొన్నాడు కనకయ్య.

"గట్లంటే ఎట్ల బిడ్డ! బతుకన్నాంక ఎన్నిలకొన్నొద్దులు! శీకటి కొన్నొద్దులు! గీకరువుకే గిట్లంటున్నరు. నిరుటి కీలకల అయితే రాగడి బురద తిని బతికినంరా!" సముదాయించింది ఎంకమ్మ.

"నీయవ్వ గాకాలమే నయం! ఏం తిన్నా నడ్మిపోయింది."

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

ఏం నయం బిడ్డా! కుక్కలోలె బతికినం. రోగమొచ్చినా రొప్పొచ్చినా సచ్చుడు తప్ప మరో దిక్కులేదు. పిలగ్ వస్తే ఊరు ఊరు ఖాళీ! నాకయితే గిప్పుడే నయమనిపిస్తంది.

"అనిపిస్తది, అనిపిస్తది. సావుదగ్గరబడితే బతకుమీద లవ్ ఆశ పెర్గుతది" రామయ్య దెప్పిపొడిచాడు.

"ఔ బిడ్డా! తప్పక సస్తమని తెల్సితే బతక బుద్ధయితది. బతుకుతమని తెల్సితే సావబుద్ధయితది. అది మనిషి పకృతి" ధర్మసూక్ష్మం వివరించింది.

కనకయ్యకూ ఎంకమ్మ చెప్పేది నిజమేననిపించింది. ఏదయినా దొరకదని తెల్సితే భ్రమలు ఎక్కువ! ఖచ్చితంగా దొరికే దానిపై పెద్దగా పట్టింపు ఉండదు. చిన్నప్పుడు సిద్దిపేటకు పోవుడంటే లగ్గం జేసుకొన్నంత సంబురం! ఇపుడు వారానికోసారి పోతున్నా ఆ ముచ్చట యాదికే ఉండదు. "అయితే ముసల్దానా! మల్లా మంచి రోజులొస్తాయంటావా?" ఆశగా అడిగాడు.

"వొస్తయి బిడ్డా! నీకు నీ శిన్నప్పటి ముచ్చట్లు యాదికొస్తే ఎంత గమ్మతనిపిస్తది? మరి అప్పుడు మీ అమ్మనాయినా, నువు గోసపడలేదా? గంతెందుకూ, ఇప్పుడు నువు కట్టపడ్డ కాలమంతా రేపు నీ ముసలి తనాన యాదికి జేస్తే ఏమంటవ్! ఎంత జెడ్డా గా దినాలే నయమంటవ్! ఎవల్లయినా గంతే. నడిశే కాలమంతా తిడ్తా బతుకుతరు. గడిశిపోయిన కాలం మంచిదని మురుస్తరు. ఎందుకంటే అది మల్ల శేతికి రాదుగదా! ఎవల్లకయినా, ఎప్పుడయినా శేతికి రాని దానిమీదే ఖాయిష్ ఎక్వ" తనకు తోచిన రీతిలో విడమర్చి చెప్పింది ఎంకమ్మ.

"దాని బొంద! ముసల్ది దానికేం తెల్సు! దాని మనసు దానికే క్యాలి లేదు. గట్లే ఉన్నయిలేనియి వొర్రది" హోటల్ రామయ్య కొట్టిపారేశాడు.

"ఎందుకు వొర్రబిడ్డా! నేను గోసపడలేదా? నేను కట్టపడలేదా? చెట్టంత కొడుకూ కోడలు ట్రాక్టర్ గుద్ది సచ్చిపోతే పదేండ్లు ఏడ్శి, ఏడ్శి పీనుగోలే కాలేదా, ఏదో నా మనవన్ని సూసుకొని మన్ను రాయిజేసుకొని గాబడి ముంగట పోరగాంట్లకు" బజ్జీలు, డబిల్ రొట్టెలు, పల్లీలు అమ్ముకుంట బతుకుతలేనా? అది కట్టంగాదా బిడ్డా? గీనా ఎన్నయేండ్ల బతుకుల లుంపి లుంపి కొట్టినా ఒక్క నాడన్నా ఒక్క యాభయి రూపాయల నోటు శేత పట్టుకొని సూసిన మొఖమేనా నాది. అయినా రేపేదో మంచిగ జర్గుతదని, మన్మనికోసం ఆశతో బతుకు తలేనా? ఉన్నట్టుండి ఎంకమ్మ వలవలా ఏడ్వసాగింది.

"అదిగాదే ముసల్దానా?" రామయ్య ఏదో సర్దిచెప్పబోయాడు.

**ఆకాశంలో వెన్నెల చిక్కబడుతోంది. సాయంకాలం తీరిగ్గా ముస్తాబయి పూర్తి రాత్రిగా మారిపోయింది. మరో అరగంట ఏ మార్పులేకుండానే గడిచిపోయింది. శామంతిలో కోపం కట్టలు తెంచుకొంటోంది.**

"ఏమో పోనీటీ శిన్నాయనా! నీయవ్వ ఏం వొర్రుడు. రెండు జబర్దస్త్ చాయ్‌లు జెయ్. ముసల్దీనేనూ తాగుతం! ఊకో అవ్వా... ఊకో..." ఓదార్చాడు కనకయ్య.

ఎంకమ్మ పది నిమిషాలకు గానీ మనిషి కాలేకపోయింది. చాయ్ తాగి నాక ఇంకో అరగంటపాటు అక్కడే కూచుని, ఇద్దరికీ పోయొస్తనని చెప్పి ఇంటికేసి తిరుగు మొఖం పట్టాడు కనకయ్య. అతడికి ఎంకమ్మ చెప్పిందే నిజమనిపిస్తోంది. బతుకు ఎపుడూ ఒక్కలాగా ఉండదు. అట్లాగనక ఉండి ఉంటే మనిషి ఇన్నాళ్ళూ భూమిమీద బతికి ఉండేవాడు కాదు. మొత్తం జాతి ఎపుడో అంతరించిపోయి ఉండేది.

కనకయ్యకు కొత్త పాఠం ఏదో నేర్చుకొన్నట్టనిపిస్తోంది. లోలోన ఒక కొత్త ఉత్సాహం తన్నుకొస్తుంటే సైకిల్ అతడి ప్రమేయం లేకుండానే వడిగా రయ్‌మని దూసుకుపోతోంది.

* * *

ఉమ్మెరకాడి గుడ్డంల సబ్‌టేషన్ ఏస్తరట! లక్ష రూపాయలిస్తారట...! సర్కారోల్లు అడికి... ఆశమ్మ కనిపించినోళ్ళకల్లా చాటింపు వేస్తూ.

"ఇగ వాన్ని... పట్ట వశమయితదా...?" అంటూ మళ్ళీ తానే దవడలు నొక్కుకొంటుంది.

"ఈ ముసల్దానికి పనేం లేదు! కనిపించినోడికల్లా అడ్గినా అడగకున్నా గీ ముచ్చట. ఎవడు జెప్పుమన్నడు? ఎట్ల పెట్టి దీనికి ఒర్రుడు గావాలె" తాను తప్ప ఆ మంచి ముచ్చట మరెవ్వరు కనకయ్యకు చెప్పొద్దనే ఆరాటంతో ఉవ్విళ్ళూరుతోన్న శామంతికి లోలోపల ముసల్దానిమీద బొండిగెల దాకా కోపం పెరిగిపోతోంది. అయితే ఆమెకో పంతో నిమిత్తం లేకుండా ఆశమ్మ వొర్రుతనే ఉంది. రాత్రి ఎనిమిదయినా కనకయ్య ఇంటికి రాలేదు. 'మంచి ముచ్చట' చెవినేద్దామని ఎదురుచూస్తోన్న శామంతికి కాలు నిలవడంలేదు. రోజూ కళ్ళుమూసుకొని రెండువేల బీడీలుచేసే ఆమెకు ఈరోజు ఒక్క బీడీ కుదిరి చావడం లేదు.

"ఈ కుక్కల కొడుకు ఇంకా రాడేందీ" మనసులో కోపంగా తిట్టుకొంది. ఆకాశంలో వెన్నెల- చిక్కబడుతోంది. సాయంకాలం తీరిగ్గా ముస్తాబయి పూర్తి రాత్రిగా మారిపోయింది. మరో అరగంట ఏ మార్పులేకుండానే గడిచిపోయింది. శామంతిలో కోపం కట్టలు తెంచుకొంటోంది.

ఇంతలో దూరంగా కనకయ్య సైకిల్ డబడబమంటూ మూల తిరిగిన చప్పుడు వినిపించింది. శామంతి ఇక ఆగలేక బీడీల చాట ఓ మూలకి విసిరేసి బయటకొచ్చింది. అలసిన చంద్రుడిలా కనకయ్య అలకలంత దూరంలోంచి వస్తూ కనిపించాడు. దశమినాటి చంద్రుడు ఆకాశంలో నిర్మలంగా విహరిస్తున్నాడు. బతుకు వెన్నెల్లో శామంతి నిశ్శబ్దంగా నవ్వుతోంది. కనకయ్య మరింత చేరువగా వచ్చాడు. ఎన్నో చెప్పాలనుకొని మనసుని రకరకాలుగా సిద్ధపరచుకొన్న శామంతి ఒక్క మాటా మాట్లాడలేక మౌనంగా, అంతకన్నా మిన్నగా సిగ్గుతో తలవంచుకొని మూలగా వొదిగిపోయింది. ఇపుడామె అచ్చంగా కొత్త పెళ్ళికూతురిలా ఉంది. అటు పక్క కట్లెతీగ మీది రేపటి పూవు ఇవాళే విరబూయాలని తొందరపడుతోంది.

★

# బంగాళా దుంపలో భగవంతుడు!?

ఆధునిక మానవుడు దేవుడిని మరిచిపోయి, అంతా తన ప్రతిభేనని భావిస్తున్నాడు. అందుకే ఆ భగవంతుడిని గుర్తు చేసుకోడానికి అప్పుడప్పుడూ విచిత్రమైన సంఘటనలు మనకు తారసపడుతూ ఉంటాయి.

1997 ఆగస్టు 20. సమయం సుమారుగా 10 గంటలు... అస్సాం రాష్ట్రంలోని గౌహతి మహానగరానికి కొస్త దూరంగా మారుమూల పల్లె. ఆ పల్లెలో ఓ ముస్లిం కుటుంబం... 60 ఏళ్ళ వృద్ధురాలు ఆయషాబేగం. ఆమె కుమారుడు మొయినుద్దీన్ అహమ్మద్, అతడి భార్య మోమినాబేగం... ఇదీ ఆ చిన్న కుటుంబం. ఆరోజు ఇంటికోడలు మోమినాబేగం కూర చేద్దామని బంగాళా దుంపలు తరుగుతోంది. అలా ఓ దుంపను కత్తిపీటతో రెండుగా కోయగానే అందులో ఆమెకు ఏదో కన్పించింది.

ఏమిటది? ఏవో అక్షరాలు. ఆమె వెంటనే అత్తగారిని పిలిచింది. ఆయషాబేగం గబగబా వంటింట్లోకి వచ్చింది. ఆశ్చర్యం. రెండు భాగాలుగా చేయబడిన బంగాళా దుంపలో అరబిక్ అక్షరాలు. ఒక భాగంలో 'మహమ్మద్' అనీ, రెండవ భాగంలో 'అల్లా' అని. అది మానవుడు రాసిన రాత కాదు. ఏ ఇంక్‌తోనూ, బాల్‌పెన్‌తోనూ, పెన్సిల్‌తోనూ రాసిందీ కాదు. బంగాళాదుంప లోపల ఎవరూ టైప్ చేయలేరు గదా! కంప్యూటర్‌పై కానీ, ప్రింట్ కానీ కాదు. మరేమిటి?

"నన్ను మర్చిపోకండి" అని ప్రపంచానికి చెప్పటం కోసమే ఆ భగవంతుడు... ఆ అల్లా బంగాళాదుంపలో "అల్లా," "అహమద్" అనే పదాలను రాసాడు. అవి చెరిపితే చెరిగేవి కావు. అల్లా సృష్టి ఈ మానవుడు తనను మరచిపోకుండా తానున్నానని జ్ఞప్తిచేసే అద్భుత సృష్టి వైచిత్రి అది. అదీ ఆప్రాంత జనంలో నమ్మకం.

ఆగస్టు 20 బుధవారం నుంచీ మొదటి మూడురోజుల్లోనే 10వేల మంది ఆ బంగాళాదుంప చూడటానికి వచ్చారు. పవిత్ర ఖురాన్‌నుంచి ఈ విధంగా రెండు పేర్లు బంగాళా దుంపలోపల లిఖింపబడి ఉండటం ఆస్తికులందరికీ బ్రహ్మానందం కలిగించింది. ఎక్కడో గౌహతి నగరంలో ఊరికి చివరగా ఉన్న వారిల్లు ఒక యాత్రా స్థలమైపోయింది. దేవుడున్నాడు అని ఈ సంఘటన మరోసారి రుజువుచేసింది.

ఆమధ్య కేరళ రాష్ట్రంలోని త్రిచూర్ మహానగరంలో ఒక హోటల్‌లో ప్రతి అరటి పండులోనూ మరో అరటి పండు- పైగా ఎప్పుడూ తిననంత తీపి... ఆ తోటలోని అరటిపళ్ళన్నీ అలాగే ఉన్నాయి. తిన్నవారు ఆశ్చర్యపోయారు. "ఎలా పెంచావు?" అని అడిగితే- "నాకేం తెలీదు. ఇదంతా నా బాలకృష్ణుని మహిమ" అన్నాడు గురువాయూర్ శ్రీకృష్ణదేవునికి దాసుడైన ఆ తోట యజమాని కేశవన్.

కొండ దేవుడి దగ్గరికు రాకపోయినా, భగవంతుడే కొండ దగ్గరకు వస్తాడు" అంటే ఇదే కాబోలు. ఆ పరాత్పరుడే భక్తుల వద్దకు వచ్చాడన్నది ఆస్తికుల నమ్మకం, ఇదీ సైన్సే అన్నది నాస్తికుల మాట.

-పద్మశ్రీ